క్లుప్తంగా

బాధిత కుటుంబానికి సాయం



బియ్యం అందజేస్తున్న దృశ్యం

జూలూరుపాడు: పాపకొల్లు గ్రామానికి చెందిన తాళ్లూరి హరుమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం బాధిత కుటుంబాన్ని జేఎస్ఆర్ యూత్ కమిటీ నిర్వాహకులు, కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యం, రూ.3,000 నగదుఅందజేశారు. కార్యక్రమంలో రోకటి సురేష్, పాపిన్ని జనార్ధన్‌రావు, రాంశెట్టి రాంబాబు, ధర్మరాజుల శంకరయ్య, తాళ్లూరి అచ్చయ్య, వీరయ్య, జి.వెంకటేశ్వర్లు, ఎస్కే సుబానీ, రాఘవులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రభుదయాళ్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని రైటర్‌బస్తీ ప్రాథమిక పాఠశాలను, నోడల్ అధికారి డాక్టర్ ప్రభుదయాళ్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల నిర్మాణ పనులు, విద్యార్థుల హాజరు, పాఠశాల నిర్వహణ అంశాలను పరిశీలించారు. ప్రాథమిక విద్యే సకల విద్యలకు పునాది కావున విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ఉచిత వైద్యశిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

జూలూరుపాడు: స్థానిక ఆర్‌సీఎం చర్చిలో బుధవారం ఖమ్మం ఆర్‌సీఎం పీఠం ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ హంస ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రతీనెల మూడో బుధవారం ఆర్‌సీఎం చర్చిలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించడం జరుగుతుందని ఫాదర్ బంధనాథం శౌరీ అన్నారు.

కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న ఉపేందర్

ఇల్లెందు: ఆదిలాబాద్ జిల్లా జైనూర్‌లో ఆదివాసీ మహిళ నీలబాయిని అక్కడి షేక్ ముగ్దుమ్ అత్యాచారం చేసి హతమార్చేందుకు ప్రయత్నించాడని, ఆ దోషిని కఠినంగా శిక్షించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా నాయకుడు సనప గోవర్ధన్, చింతా ఉపేందర్ డిమాండ్ చేశారు. బుధవారం ఇల్లెందులో జరిగిన సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. కిన్నెర కిషోర్, సూర్ణపాక రాకేష్, రవీందర్, రామచంద్రయ్య, ఈసం సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై నుంచే సాగునీటి సరఫరా



రోడ్డుపై పారుతున్న సింగభూపాలెం చెరువు నీళ్లు

సుజాతనగర్: కాల్వ ద్వారా ప్రవహించాల్సిన చెరువు నీళ్లు రోడ్డుపై ప్రవహిస్తున్నాయి. సింగభూపాలెం చెరువు నీటిని సాగుకు అందించేందుకు గతంలో ఓ కాల్వను ఏర్పాటు చేశారు. తహసీల్దార్ కార్యాలయం దాటిన తరువాత కుడిపక్కన కొందరు అక్కడక్కడా ఆ కాల్వను పూడ్చివేశారు. దీంతో ఈ కాల్వ ద్వారా వచ్చే నీరంతా ప్రస్తుతం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద డ్రెయినేజీ, రోడ్డుపై నుంచి పంటపొలాలకు వెళ్తోంది. ఈ క్రమంలో ఆ ప్రాంతంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అంతేకాకుండా రోడ్డంతా ధ్వంసం అవుతోంది. ఇరిగేషన్ అధికారులు స్పందించి పూడ్చి వేసిన కాల్వను పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

పునాదులు దాటని నిర్మాణాలు..

- సభలు, సమావేశాలు జరిగేదెప్పుడో..?
- అటు బంజారా, ఇటు అంబేడ్కర్ భవన్‌లు
- ఇల్లెందులో అసంపూర్తి నిర్మాణాలను పట్టించుకోని అధికారులు



పిల్లర్ల దశలో ఉన్న అంబేడ్కర్ భవనం

ఇల్లెందు: రూ.కోట్ల ఖర్చుతో నిర్మిస్తున్న భవనాలు పునాదులు, పిల్లర్ల నిర్మాణ దశలోనే ఉన్నాయి. 2022 ఫిబ్రవరి 15న బజారా భవన్‌కు శంకుస్థాపన చేశారు. ఇక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌కు గడిచిన మే 18న శంకుస్థాపన జరిగింది. ఈ రెండు భవన నిర్మాణాలు ఇప్పట్లో పూర్తయ్యేలా కనిపించటం లేదు. నెల రోజులుగా వర్షాలు కురుస్తున్నందున ఇక పనులు సాగటం కష్టమే అంటున్నారు. కారణం ఏదైతేనేం పనులు మాత్రం నిలిచిపోయాయి. గత ఏడాది ఇదే వర్షాకాలంలో బంజారా భవన్ కోసం తవ్విన గుంతల్లో నీరు చేయటంతో ఆ పక్కనే మిషన్ స్కూల్ పిల్లలు అటు వైపు వచ్చే ప్రమాదం ఉందని అక్కడి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంబేద్కర్ భవన నిర్మాణం కూడా పునాదుల దశ దాటలేకపోతోంది. బంజారా భవన్‌కు రూ.1.20 కోట్లు, అంబేద్కర్ భవన్‌కు రూ.2.15 కోట్లతో నిర్మాణం చేపట్టారు. అయితే ఇదే అంబేద్కర్ భవనానికి గతంలో రూ.1.15 కోట్లు మంజూరు కాగా ఆ నిధులు సరిపోవని ఇంజనీరింగ్ అధికారులు సూచించటంతో మరో రూ.కోటి నిధులు డీఎంఎఫ్ నుంచి కేటాయించారు. ఇక బంజార భవన్‌కు కూడా నిధులు సరిపోవంటున్నారు. అయితే నిధులు ఉన్నంత వరకు పనులు చేపట్టి తర్వాత సరిపడ నిధులు కేటాయించిన తర్వాత పూర్తి చేస్తామని గతంలో ప్రకటించారు.

సభలు, సమావేశాలు, శుభకార్యాలు జరుపుకునేందుకు ...

నూతనంగా నిర్మిస్తున్న బంజారా భవన్, అంబేద్కర్ భవనాల్లో శుభకార్యాలు, సభలు, సమావేశాలు జరుపుకోవాలని అందుకు అనువుగా ఉండేలా నిర్మాణాలు చేపట్టారు. కానీ ఈ రెండు భవనాలు నిర్ణీత సమయానికి పనులు పూర్తి చేసే పరిస్థితి లేదు. రూ.కోట్ల వెచ్చించి నిర్మిస్తున్న ఈ అధునాతన భవనాల్లో శుభ కార్యాలు జరిగేనా అని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

సదుపాయాలు ఇలా ...

బంజారాలు, దళితుల కోసం ఏర్పాటు చేస్తున్న ఈ భవనాల్లో సభలు, సమావేశాలు, శుభకార్యాలు నిర్వహించుకునే అవకాశం ఉంటుంది. ఈ భవనాల్లో సుమారు 1000 మంది సీటింగ్ సామర్థ్యం ఉండాలని శుభకార్యాలు నిర్వహించుకునేందుకు కళ్యాణ వేదిక, సభలు సమావేశాలు నిర్వహించుకునేందుకు సభావేదిక ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇక రెండు విశ్రాంతి గదులు, వంటలు ఏర్పాటు చేసుకునేందుకు రెండు ప్రత్యేక గదులు, మరుగుదొడ్లు, స్నానపు గదులు, వాష్ బేసిన్‌లు, మంచినీటి బోరు, మోటారు, వాటర్ ట్యాంకు, చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

కలెక్టర్ సందర్శించాలి..



కలెక్టర్ సందర్శించి పనులను పరిశీలించాలి. బంజారా భవన్ నిర్మాణం వేగంగా పూర్తి చేయాలి. ఏడాది క్రితం శంకుస్థాపన జరిగింది. సగం పనులు కూడా పూర్తి కాలేదు. సభలు, సమావేశాలు జరుపుకునేది ఎప్పుడు..? రూ.కోట్లు వెచ్చించి నిర్మిస్తున్న ఈ భవనాల్లో సభలు, సమావేశాలు, శుభకార్యాలు నిర్వహించుకునే వారికి ఉపయోగంగా ఉంటుంది.

– రాంచందర్ నాయక్, ఇల్లెందు

త్వరగా పూర్తి చేయాలి..



ఎస్సీ, ఎస్టీ వర్గాల అభివృద్ధికి నిర్మిస్తున్న బంజారా, అంబేద్కర్ భవనాల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి. ఏడాది క్రితం పనులు ప్రారంభించారు. నేటికీ పునాదల దశ దాటలేదు. ఇప్పుడు వర్షాకాలం వచ్చింది. పనులు నిలిచిపోయాయి. ఇప్పుడు పనులు మొదలయ్యే పరిస్థితి లేదు. వర్షాలు తగ్గిన తర్వాత అయినా వేగంగా నిర్మాణాలు పూర్తి చేయాలి.

– చాందావత్ రమేష్ నాయక్, ఇల్లెందు

ఓటరు జాబితాపై అవగాహన కల్పించండి..

ఇలెందురూరల్: గ్రామపంచాయతీ, వార్డు స్థాయిలో ఫొటో ఓటరు జాబితా ప్రదర్శిస్తున్న విషయం ప్రజలకు సమాచారం అందించాలని ఎంపీడీఓ ధన్ సింగ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు జాబితా రూపొందించిన విధానం, అందులో అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేయాల్సిన విధానంపై ప్రజలకు సంపూర్ణంగా అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రజలతోపాటు రాజకీయ నాయకులు పంచాయతీ కార్యాలయంలో తెలిపే అభ్యంతరాలను నమోదు చేసుకోవాలని ఆదేశించారు. ఓటరు తుది జాబితాలో తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

నేడు రాజకీయ పక్షాలతో సమావేశం..

పంచాయతీ, వార్డుల వారీగా సిద్ధం చేసిన ఫొటో ఓటరు జాబితాపై గురువారం అన్ని రాజకీయ పక్షాల నేతలతో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ ధన్‌సింగ్ బుధవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించే సమావేశానికి రాజకీయ నాయకులు సకాలంలో హాజరై సహకరించాలని కోరారు.

పోషకాహారంతో తల్లీబిడ్డలకు ఆరోగ్యం



గొల్లగూడెం అంగన్‌వాడీలో ప్రతిజ్ఞ చేస్తున్న తల్లులు

కొత్తగూడెంటౌన్: తల్లీబిడ్డలకు పోషకాహారమే శ్రీరామరక్షణ అని అంగన్‌వాడీల్లో ప్రతీరోజు అందించే పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని 17 వార్డు కౌన్సిలర్ కళ్యాణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరోజిని అన్నారు. బుధవారం కొత్తగూడెం రైటర్ బస్తీ న్యూగొల్లగూడెం 5వ సెక్టార్‌లోని అంగన్‌వాడీ సెంటర్‌లో పోషకాహార వారోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడారు. తల్లులు, పిల్లలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. తల్లులకు బహుమతులను అందజేశారు. అంగన్‌వాడీ టీచర్లు సత్యవతి, లక్ష్మి, ప్రమీల ,లత, ఆయాలు, ఆశా కార్యకర్తలు, ఎంఎస్‌ఎంలు, డ్వాక్రా మహిళలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ



టేకులపల్లి: ప్రభుత్వ జూనియర్ కాలేజీలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న విద్యార్థులు, నాయకులు

ఇల్లెందు: పీడీఎస్‌యూ 50 వసంతాల సభ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బి.సాయి, ఎం.పార్థసారథి విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఇల్లెందు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోస్టర్లు ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. ఉస్మానియా అరుణతార జార్జిరెడ్డి నాయకత్వంలో పదిమంది విద్యార్థులతో ఏర్పడిన పీడీఎస్... జార్జిరెడ్డి అమరత్వం తర్వాత జంపాల చంద్రశేఖర ప్రసాద్ నేతృత్వంలో పీడీఎస్‌యూగా ఆవిర్భవించిందన్నారు. ఈ నెల 30న జరగనున్న సభను విజయవంతం చేయాలని కోరారు.

టేకులపల్లి: భారత విద్యార్థి ఉద్యమాలకు పీడీఎస్‌యూ దిక్సూచిలా నిలిచిందని ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి కాంపాటి పృథ్వీ అన్నారు. ఈ మేరకు బుధవారం టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి పీడీఎస్‌యూ 50 వసంతాల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈనెల 30న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో జరగనున్న సభకు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. బి.సాయి, ఈసం ప్రణీత్‌రాజ్, హరీష్ సంతోష్, సంధ్య, శ్రావణి, నిరోష తదితరులు పాల్గొన్నారు.

శ్రామికుల సంయుక్త శాఖల మహాసభ



మాట్లాడుతున్న బ్రహ్మచారి

ఇల్లెందు: సీఐటీయూ ఆధ్వర్యంలో ఇల్లెందులోని ఏలూరి భవన్‌లో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్, సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం, శ్రామిక మహిళా సంఘం సంయుక్త సమావేశం బుధవారం జరిగింది. నాయకులు వెంకటమ్మ, కామ నాగరాజు, సాధిక్‌ల అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకులు కొలగాని బ్రహ్మచారి మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ కార్మికచట్టాలను తుంగలో తొక్కిందన్నారు. రాష్ట్రంలో ప్రజాపాలన సాగిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కార్మికుల కోసం ఏమీ చేయలేదన్నారు. అసంఘటిత రంగ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నబీ, కృష్ణ, మోహన్‌రావు, వెంకటమ్మ, సుల్తానా, లక్ష్మి, కిరణ్, ఫాతిమా, ఉమ, మహమూద్, లక్ష్మణ్, భద్రు, శ్రీను, యాసిన్, రాజేష్, సాధిక్, ఐలమ్మ, వెంకన్న పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్లు వితరణ



సైకిళ్లు అందజేస్తున్న హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య

జూలూరుపాడు: స్థానిక ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదిమంది పేద విద్యార్థినులకు ఖమ్మం జిల్లా ఎన్ఆర్ఐ ఫౌండేషన్ వారు బుధవారం సైకిళ్లు వితరణగా అందజేశారు. హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య మాట్లాడుతూ.. ఎన్ఆర్ఐ ఫౌండేషన్ వారి సేవలు స్ఫూర్తిదాయకం అని కొనియాడారు. గుండెపిన్ని వెంకటేశ్వర్లు, యాసా నరేష్, బానోత్ ధర్మా, తంబర్ల నరసింహారావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

క్రీడా శిక్షణకు దరఖాస్తులు

కొత్తగూడెంటౌన్: జిల్లా, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు ప్రత్యేక శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి (డీవైఎస్‌ఓ) ఎం.పరంధామరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం జిల్లాలోని క్రీడాకారులను మరింతగా ప్రోత్సహించేందుకు క్రీడా పాలసీని రూపొందిస్తోందని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 23వ తేదీలోపు ధ్రువపత్రాలు, రెండు ఫొటోలు యువజన క్రీడలశాఖ కార్యాలయంలో అందజేయాలని కోరారు. వివరాలకు 9966125087 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

ఏచూరి ఆశయాలు సాధిద్దాం..



సింగరేణి(కొత్తగూడెం): మాట్లాడుతున్న వీరన్న



టేకులపల్లి: మాట్లాడుతున్న వీరభద్రం

సింగరేణి(కొత్తగూడెం): నేటి విద్యార్థులకు నిరంతర స్ఫూర్తి సీతారాం ఏచూరి జీవితమని, ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర కమిటీ సభ్యుడు డి.వీరన్న అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రతిభ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు రామ్‌చరణ్ అధ్యక్షతన సీతారామ్ ఏచూరి సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడారు. విద్యారంగ, ప్రజాసమస్యల మీద నిరంతరం అధ్యయనంతో పోరాటమే ఏచూరి నివాళి అన్నారు.

22న సీతారాం సంస్మరణ సభ

సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఈనెల 12న మృతి చెందారు. ఈ మేరకు కొత్తగూడెంలోని కమ్మ కల్యాణ మండపంలో ఈనెల 22న ఏచూరి సంస్మరణ సభ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. పట్టణ ప్రజలు, నాయకులు, మేధావులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆపార్టీ వర్గీ యులు బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

టేకులపల్లి: ఎస్ఎఫ్ఐ మాజీ అఖిల భారత అధ్యక్షుడు, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి, అమరుడు సీతారాం ఏచూరి ఆశయాల సాధనకు ప్రతి విద్యార్థి కృషి చేయాలని ఎస్ఎఫ్ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి బి.వీరభద్రం అన్నారు. ఈ మేరకు బుధవారం టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సీతారం ఏచూరి సంస్మరణ సభను నిర్వహించారు. మాట్లాడుతూ... విద్య సరుకు కాదు అనే అంశంపై జాతీయ సాంకేతిక విద్యా సంస్థ, కురుక్షేత్రలో సీతారాం ఏచూరి చేసిన ప్రసంగంపై సెమినార్ అంశాలను వివరించారు. భారతదేశంలో స్వచ్ఛమైన రాజకీయాలకు పట్టంగట్టిన సీతారాం ఏచూరి మరణం తీరని లోటన్నారు. మందా నాగకృష్ణ, ప్రేమ్ కుమార్, ఉదయ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుకతో నిండిన పంట కాలువ



సాగునీరు అందక ఎండిపోతున్న వరిపొలం

పాల్వంచరూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రెడ్డిగూడెం సమీపంలోని రాళ్లవాగు పిక్‌డ్యామ్ అలుగు పక్కన గండిపడి పంట పొలాలకు సాగు నీరు సరఫరా జరిగే కాలువ పూడకపోయింది. దీనివల్ల పంటపొలాలకు సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు ఇసుక బస్తాలతో తాత్కాలికంగా గండిని పూడ్చివేశారు. కుడికాలువ, ప్రాజెక్ట్ తూము ఇసుక, మట్టితో నిండి పూడుకపోయింది. దీనికింద సుమారు ఆరువందల ఎకరాల ఆయకట్టు ఉంది. సంబంధిత ఏఈకి పలుమార్లు సమస్యను విన్నవించినా పట్టించుకోవడం లేదని బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. పొలాలు ఎండిపోక ముందే అధికారులు స్పందించి కాలువలోని సిల్ట్‌ను తొలగించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈ ఊర్మిళను వివరణ కోరగా.. త్వరలో సమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

విద్యార్థి మృతికి కారకులను శిక్షించాలి

ఇల్లెందురూరల్: సీతారాంపురం వద్ద విద్యార్థులు ప్రయాణిస్తున్న ఆటోను ఢీకొట్టిన కారు డ్రైవర్‌ను కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇర్ప రాజేష్ డిమాండ్ చేశారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని ఆరోపించారు. మృతి చెందిన విద్యార్థికి ప్రభుత్వం రూ.25లక్షలు ఎక్స్‌గ్రేషియా, గాయపడిన విద్యార్థులకు వైద్యసహాయం అందించాలని డిమాండ్ చేశారు.ఎమ్మెల్యే స్పందించి విద్యార్థులను ఆదుకోవాలని కోరారు.

స్వచ్ఛతా హీ సేవాలో భాగస్వాములు కండి..



కొత్తగూడెంఅర్బన్: స్వచ్ఛత ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



పాల్వంచరూరల్: జగన్నాథపురం పాఠశాలలో మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయభాస్కరరెడ్డి

కొత్తగూడెంఅర్బన్: స్వచ్ఛతా హీ సేవా 2024 (అక్టోబర్ 2న గాంధీ జయంతి) కార్యక్రమంలో ప్రతీఒక్కరు భాగస్వామ్యులు కావాలని మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి తెలిపారు. బుధవారం కొత్తగూడెం మున్సిపల్ పరిధిలోని అన్ని స్కూళ్లలో స్వచ్ఛత ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, అశోక్ చౌహన్, వీరభద్రాచారి, జవాన్లు నాగేశ్వరరావు, రవి, మెప్మా సిబ్బంది, ఐపీసీ వావ్ ప్రతినిధి రవి, స్కూల్ స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎకోబ్రిక్స్ తయారీపై అవగాహన

పాల్వంచరూరల్: ప్లాస్టిక్ వినియోగం వలన పర్యావరణం దెబ్బతింటుందని, ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి రీసైక్లింగ్ చేసి ఎకోబ్రిక్స్ తయారు చేయాలని ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం జగన్నాథపురం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ... ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి వాటితో ఎకోబ్రిక్స్ తయారుచేయాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ బి.నారాయణ, ఏపీఎం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తోగ్గూడెం పాఠశాలలో..

మండలంలోని తోగ్గూడెం పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి సీసాల్లో నింపి వాటిని ఎకోబ్రిక్స్‌గా తయారుచేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రవి, హెచ్‌ఎం సురేష్, నాగమణి, పాషా తదితరులు పాల్గొన్నారు.

గణేష్ మండపాల వద్ద అన్నదానం



పాల్వంచ: వర్తక సంఘం మండపం వద్ద అన్నదానంలో పాల్గొన్న భక్తులు

పాల్వంచ: గణేష్ నవరాత్రులు ముగిసిన సందర్భంగా పట్టణంలోని వర్తక సంఘం వినాయక మండపం వద్ద బుధవారం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు చలవాది ప్రకాష్, గూడెపు శ్రీనివాస్, బచ్చు శ్రీనివాస్, డోగిపర్తి సతీష్, రిత్విక్, టి.శ్రీనివాస్, పెండ్యాల రోజాలక్ష్మి, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: పాపకొల్లు గ్రామంలో గణేష్ మండపం వద్ద జేఎస్ఆర్ యూత్ కమిటీ, గణేష్ ఉత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం మహా అన్నదానం నిర్వహించారు. రాంశెట్టి రాంబాబు, ధర్మరాజుల శంకరయ్య, గుమ్మడి వెంకటేశ్వర్లు, పాపిన్ని మధుకిరణ్, రాయి సాయి, కొదుమూరి రంగారావు, నరేందర్, గణేష్ విగ్రహదాత ఉర్లమెట్టి రవి తదితరులు పాల్గొన్నారు. కాకర్ల గ్రామ పంచాయతీ దుబ్బతండాలోని గణేష్ మండపం వద్ద మంగళవారం రాత్రి జ్యోతిలింగార్చన పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన నిర్వహించి, గణేష్ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించి, నిమజ్జనానికి తరలించారు.

సుజాతనగర్: గణేష్ నవరాత్రుల్లో భాగంగా సీతంపేట బంజర గ్రామంలో బుధవారం లడ్డూ ప్రసాదానికి వేలంపాట నిర్వహించారు. పలువురు పోటీ పడ్డారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ధరావత్ శ్రీను, జ్యోతి దంపతులు రూ.12,600కు దక్కించుకున్నారు.

టేకులపల్లి: మండల కేంద్రంలోని గణేష్ మండపం వద్ద నిమజ్జనం అనంతరం మహా అన్నదానం ఆనవాయితీ ప్రతి సంవత్సరం కొనసాగుతోంది. ఇందులో భాగంగా బుధవారం మహా అన్నదానం కార్యక్రమాన్ని ఎస్ఐ సురేష్, ఎమ్మెల్యే సతీమణి కోరం లక్ష్మీ ప్రారంభించారు. కార్యక్రమంలో మండప కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



టేకులపల్లి: భక్తులకు అన్నప్రసాదం అందిస్తున్న ఎస్ఐ సురేష్



సుజాతనగర్: లడ్డూ ప్రసాదంతో శ్రీను దంపతులు



జూలూరుపాడు: దుబ్బతండాలో గణేష్ మండపం వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824
లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148
భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476
ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎస్ దుర్గారాంప్రసాద్ -9000327175
టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎస్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183
ఎస్. శేషయ్య - 99121 99148